తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
14, మే, 2026

## అక్రమ రవాణాపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**- అక్రమ రవాణా చట్ట విరుద్ధ కార్యకలాపాలపై డైల్100కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు**
**- బక్రీద్ పండుగ నేపథ్యంలో తూప్రాన్ టోల్ గేట్ చెక్ పోస్టును తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు**







**తూప్రాన్ మే 13(జనంసాక్షి):** బక్రీద్ పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అప్రమత్త చర్యలు చేపట్టారు. తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాల ను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమ రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. సమావేశంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ సూపర్ సీఐ వెంకట రాజ గౌడ్ ఎస్సై గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో... కీలక పాత్ర

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**పాపన్నపేట, మే 13 (జనంసాక్షి) :** జనగణన 2027 లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. బుధవారం కుర్తివాడ గ్రామంలో జనగణనను తహశీల్దార్ సతీష్ కుమార్ తో కలిసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ .. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు,ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని,గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కుర్తివాడలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. డి.ఎస్ఓ. డిఎం.సిఎస్ఓ, గ్రామ సర్పంచ్ చెట్టుకింది శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి

**- చీఫ్ ఇంజనీర్ రామ్మోహన్ రావు**



**మల్దకల్ మే 13 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను బుధవారం చీఫ్ ఇంజనీర్ రాంమోహన్ రావు పరిశీలించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రూ. 5కోట్ల వ్యయంతో నిర్మాణం అవుతున్న మహిళా సమాఖ్య భవనం పనులను పంచాయతీ రాజ్ శాఖ చీఫ్ ఇంజనీర్ రాంమోహన్ రావు పరిశీలన చేసి హైదరాబాద్ నుండి వచ్చిన అయన మహిళా సమాఖ్య భవనం పనులు నాణ్యతగా ఉండాలన్నారు.ఈ నెలలోపు భవనం నిర్మాణం పనులు పూర్తి చేయాలని జిల్లా అధికారి ప్రభాకర్ కు ఆదేశాలు ఇచ్చారు.అయన వెంట ఎస్ ఈ దామోదర్ రావు,ఈఈ ప్రభాకర్,డీఈ లక్ష్మన్న, ఎఈ రాజశేర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే ,కలెక్టర్ పర్యటన

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అయూబ్ పాషా**



**ఉర్కొండ మే 13, (జనంసాక్షి) ;** మండలంలో హలో అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రానున్నారని మండల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అయూబ్ పాషా అన్నారు. ముందుగా రాచాలపల్లి, రేవల్లి, గుడిగానిపల్లి, రాంరెడ్డి పల్లి ,బొమ్మరాసిపల్లి, బాల్యలోక తండా గ్రామాలలో పర్యటించనాన్నున్నారని మండల పరిధిలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అయూబ్ పాషా తెలిపారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకకు మంత్రి వాకిటి శ్రీహరి




అమరచింత ఆత్మకూర్ మే 13జనంసాక్షి): ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని బుధవారం పెద్దమ్మతల్లి విగ్రహా ప్రతిష్ట మహోత్సవ వేడుకకు ముఖ్య అతిథి గా రాష్ట్ర క్రీడలు యువజన పాడి పరిశ్రమ మత్స్య పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈరోజు పెద్దమ్మతల్లి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలో చేశారు.అనంతరం ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు వేదాశీర్వచనంతో ప్రత్యేకంగా మంత్రి గారిని ఆలయ కమిటీ సభ్యులు శాల్వలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఈ ఆలయానికి 140 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు.ఈ గుడి నిర్మాణంలో పాలు పంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణం చేసుకోవాలని ఆలోచన వచ్చిన ప్రతీ ఒక్కరికీ, భక్తులకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఎల్లప్పుడూ ఆత్మకూరు సుభిక్షంగా ఉండాలని పెద్దమ్మ తల్లి ఆశీర్వాదం అందరిపై ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి కమిటీ చైర్మన్ మొగిలి శ్రీధర్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ నాగమణి వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు తాసిల్దార్ జెకె మోహన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్ పరమేష్ కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు మస్తీపురం మనీ వర్ధన్ రెడ్డి చిన్న పరమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహా శుభకార్యాలకు . నూతన గృహప్రవేశానికి హాజరైన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి నాయుడు గారు

**మే 13 ధరూర్ (జనంసాక్షి);** మండల పరిధిలో వివిధ గ్రామాల జరిగిన పలు వివాహా వేడుకలకు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి, ఆశీర్వదించి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నాగర్ దొడ్డి గ్రామంలో జరిగిన నూతన గృహప్రవేశానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పటేల్ జనార్దన్ రెడ్డి, వెంకటేష్ నాయుడు,రాముడు, లక్ష్మారెడ్డి,శేషాద్రి నాయుడు, శ్రీరాములు,గోవిందు,రాము, పుణ్యమూర్తి,శ్రీకాంత్,మద్దిలేటి,చిన్న హనుమంతు,కృష్ణ,మోహన్, భీమేష్, ఆంజనేయులు, జమన్న,రమేష్, సిద్దు, నరసింహులు, రవి, వీరేష్, రాజు,కార్తీక్,శ్రీనివాసులు, మహేందర్, నరేష్, హరికృష్ణ,జయన్న మరియు వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## హార్వెస్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**- బాధితుడి బంధువు ఆదాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు**



**రేవల్లి మే 13 (జనంసాక్షి):** అజాగ్రత్తగా వచ్చిన హార్వెస్టర్ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గోపాల్‌పేట సమీపంలోని దేవర గుట్ట తండా సమీపంలోని బండ్ల బాట వద్ద చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జగన్మోహన్ తెలిపిన వివరాల మేరకు గొల్లపల్లి గ్రామానికి చెందిన పగడాల శాంతయ్య (50), మే 12న సాయంత్రం 09:00 గంటలకు తన ద్విచక్ర వాహనం టీజీ 31బీ 2818 నంబర్ గల ద్విచక్ర వాహనంపై పెబ్బేరుకు వెళ్తుండగా, పక్కనుండి వచ్చిన హార్వెస్టర్ టీజీ 32 ఎస్ 5702 నంబర్ గల శాంతయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతయ్య కుడి చేయి విరగడమే కాకుండా పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**- విద్యా వారోత్సవాలు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్**



**నాగల్గిద్ద మే 13 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గవ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నారాయణఖేడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొని విద్యా వారోత్సవాల ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు.

**ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..**

"విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని విధాలుగా బలోపేతం చేస్తాం" అని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## డెంటల్ హాస్పిటల్ ప్రారంభించిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, మే 13, (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన సమర్థ సాయినాథ్ డెంటల్ హాస్పిటల్‌కు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమని పేర్కొంటూ, డెంటల్ హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఆసుపత్రి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల శారద అశోక్, వెంకట్ సాగర్, అడ్వకేట్ వెంకటేశ్వర్ రెడ్డి, వైద్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ కాలనీలో మంచినీటి బోరు ప్రారంభం



**- వేసవిలో నీటి ఎద్దడి తీర్చడమే లక్ష్యం బాలవికాస**

**జడ్చర్ల, మే 13 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు పరిధిలో గల శ్రీ కృష్ణ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి బాలవికాస సోషల్ సర్వీస్ సొసైటీ ముందడుగు వేసింది. పెరుగుతున్న ఎండల దృష్ట్యా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను గమనించి, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన మంచినీటి బోరు పంపును బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కష్టాలు కలగకుండా ఉండేందుకు ఈ బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలవికాస ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రశాంత్ గౌడ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మార్తా డేవిడ్, మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు. తమ కాలనీలో నీటి సమస్యను గుర్తించి బోరు వేయించినందుకు శ్రీకృష్ణ కాలనీవాసులు బాలవికాస సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామీణ సంస్కృతికి ప్రతీక బొడ్రాయి ఉత్సవాలు

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



**జడ్చర్ల, మే 13 (జనంసాక్షి):** గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు బొడ్రాయి ఉత్సవాలు ప్రతీకలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మండలంలోని నస్రుల్లాబాద్ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించిన బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు పల్లెల్లో సామాజిక ఐక్యతకు నిదర్శనమని, మన పూర్వీకుల నుండి వస్తున్న ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## పెబ్బేర్ ఆదర్శ కళాశాలలో ప్రవేశాలు

**పెబ్బేరు మే 13 (జనంసాక్షి):** పెబ్బేరు ఆదర్శ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పుంటి నరేష్ కుమార్ తెలిపారు. ప్రతి గ్రూపులో 40 సీట్లు ఉన్నాయని,పదవ తరగతి ఫలితాల మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్ వెబ్సైట్ https://tgms. telangana.gov.in ద్వారా దరఖాస్తు చేయవచ్చు.దరఖాస్తుకు ఎటువంటి ఫీజు లేదు. మొబైల్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.ఈ సంవత్సరం ACE (అకౌంట్స్ కామర్స్, ఎకనామిక్స్) అనే కొత్త కోర్సు ఎంఇసి కోర్సు స్థానంలో ప్రవేశపెడుతున్నారని, దరఖాస్తు చేసుకోవడానికి మే 25వ తేదీ వరకు గడువు ఉందని, ఎంపిక చేసిన విద్యార్థుల జాబితా మే 27వ తేదీన కళాశాలలో అందుబాటులో ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మే 28 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని మోడల్ కళాశాల పెబ్బేర్ ప్రిన్సిపాల్ డాక్టర్ తూర్పింటి నరేశ్ కుమార్ తెలిపారు.

## వడ్ల ట్రాక్టర్కు ఢీ కొట్టిన ఇసుక లారీ

**- ట్రాక్టర్ అదుపుతప్పి రెండు కార్లకు ఢీ**

**- ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**

**బెజ్జంకి, మే 13 (జనంసాక్షి):** మండలం లోని రేగులపల్లి గ్రామ శివారులోని సెయింట్ పల్లోటి స్కూల్ సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామం నుంచి వరి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ను నెంబర్(టిఎస్22టి1099)ను వెనుక నుంచి వచ్చిన ఇసుక లారీ నెంబర్ (టిఎస్36టిఏ6966) డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఢీ కొట్టాడు.దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి రెండు కార్లను ఢీకొని( మారుతి విటారా బ్రేజా టిజి2బి 0671,ఇన్నోవా టిజి 21టి1653) అనంతరం చెట్టును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ చొప్పరి చందు(38)కు తీవ్ర గాయాలు కాగా,స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సిద్ధిపేట ఆస్పత్రికి తరలించారు.ప్రమాదంలో ట్రాక్టర్,ట్రైలర్‌తో పాటు రెండు కార్లు దెబ్బతిన్నాయి.ఘటన అనంతరం లారీ డ్రైవర్ పరారైనట్లు సమాచారం అందుకున్న బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.





## పోతరాజుపల్లి వద్ద శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి స్వాగత త్వరణం ప్రారంభం

**తూప్రాన్, మే 13,(జనంసాక్షి):** తూప్రాన్ మండల పరిధిలోని పోతరాజుపల్లి చౌరస్తా వద్ద ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించేలా నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి స్వాగత తోరణం (కమాన్) బుధవారం వైభవంగా ప్రారంభమైంది. వైశాఖ బహుళ ఏకాదశి బుధవారం ఉదయం 5:15 గంటలకు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి స్వాగత తోరణ ప్రారంభోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మనీ రాజేశ్వరరావు సరోజినీ దేవి గాళ్ల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు మన రాజేశ్వర అశోక్ కుమార్ పుష్పలత గారితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

పోతరాజుపల్లి కమాన్ నేడు కేవలం ఒక స్వాగత తోరణం మాత్రమే కాకుండా, భక్తి, విశ్వాసం, కుటుంబ సేవా సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ కమాన్ భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది. 1967 సంవత్సరంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవకులు స్వర్గీయ శ్రీ మన్నె రాజేశ్వర్ రావు - సరోజినీదేవి దంపతులు తమ వంతు సేవాభావంతో నాచారంగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి అనుబంధంగా పోతరాజుపల్లి చౌరస్తా వద్ద ఈ కమాన్‌ను నిర్మించారు.

కాలక్రమేణా జాతీయ రహదారి విస్తరణ పనులతో కమాన్ మధ్యలోకి రావడం, భారీ వాహనాలు ఢీకొనడం వల్ల పాత కమాన్‌కు బీటలు రావడంతో స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని మన్నె కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన శ్రీ మన్నె రాజేశ్వర్ అశోక్ కుమార్ గారు నూతన కమాన్ నిర్మాణానికి హామీ ఇచ్చి, అత్యంత శోభాయమానంగా ఆధునిక హంగులతో కమాన్‌ను పునర్నిర్మించారు.



స్వర్గీయమన్నె రాజేశ్వర్ రావు - సరోజినీదేవి గార్ల జ్ఞాపకార్థంగా వారి కుమారుడు మన్నె రాజేశ్వర్ అశోక్ కుమార్ ధర్మపత్ని పుష్పలత గారితో కలిసి ఈ మహత్తర నిర్మాణాన్ని చేపట్టారు. వారి కుటుంబ సభ్యులు మన్నె అశోక్ విశాల్, అశోక్ క్రాంతి, ఆశకి సుమన్, తదితరులు పూజలో పాల్గొన్నారు మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ యంజాల కీర్తన విఠల్ రెడ్డి , మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డు రాధాకుమారి శ్రీనివాస్, ఐలేని యాదవ్, నాచారంగుట్ట దేవస్థాన చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, ఈవో బెల్లంకొండ రంగాచారి, మాజీ ఎఫ్డీసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ సత్యనారాయణ గౌడ్, బుక్క విజయ్ కుమార్, పోతరాజు ధనరాజ్, కౌన్సిలర్ కుమ్మరి చెలిమెల రాములు, మాజీ కౌన్సిలర్ దుర్గా రెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్,జగ్గన్నగారి సురేందర్ రెడ్డి, కె.ఎస్.కురుముల రావు, రుద్ర శ్రీహరి, శ్రీనాయకం శ్రీనివాస్, కూచవరం సంతోష్ కుమార్, బెల్లంకొండ జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

**- కలెక్టర్ ప్రియాంక**



**నారాయణపేట జిల్లా బ్యూరో మే 13(జనంసాక్షి):** పారిశుద్ధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పురవార్డులను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం ఉదయం కలెక్టర్ జిల్లా కేంద్ర మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరో వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్‌ను చైర్‌పర్సన్ కొండా శ్వేతా, సత్యయాదవ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో గల బీసీ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజల సమ స్యలను అడిగి తెలుసుకు న్నారు. వార్డు వాసుల సమ స్యలపై ఆమె సానుకూలంగా స్పందించారు.తమకు మరు గుదొడ్లు లేవని పలువురు మహిళలు కలెక్టర్ కు విన్న వించడంతో స్పందించిన ఆమె స్వచ్ఛ భరత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మా ణానికి ప్రతిపాదనలు పంపించి అనుమతి తీసు కోవాలని మున్సిపల్ అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ శంకర్, ఇంజినీర్ మహేష్, మున్సిపాలిటీకి చెందిన జవాన్లు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాలఅధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పుడు ఒప్పు...ఇప్పుడు తప్పా..?

**- కాంగ్రెస్ విమర్శలు నీతి బాహ్యమైనవి**
**- కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ**

**నారాయణపేట మే 13(జనంసాక్షి):** ప్రధాని నరేంద్రమోడీ పొదుపు పాటించమని దేశ ప్రజలకు పిలుపునిస్తే కాంగ్రెస్ నాయకులు నీతి బాహ్యమైనవి విమర్శలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో మండిపడ్డారు. 2013లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి చిదంబరం రూపాయి బలహీన పడకుండా ఉండాలంటే బంగారం ఎవరు కొనొద్దని దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తే ఆనాడు కాంగ్రెస్ నాయకులకు ఒప్పుగా కనిపించిందని విమర్శించారు. నాడు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడున్న విపత్కర పరిస్థితులు అప్పుడు లేవని అయినా బంగారం కొనొద్దంటే ఒప్పుకున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ప్రధాని నరేంద్రమోడీ పిలుపును తప్పుపట్టడం రాజకీయం కాదా అని ప్రశ్నించారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఉందని అయినా ప్రధాని కేవలం ఒక్క ఏడాది పాటు బంగారం కొనొద్దని,ఇంధన పొదుపు పాటించాలని దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడం కోసమేనని అన్నారు.కానీ ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఛీత్కరించినా రాజకీయాలే తప్ప దేశ ఉన్నతి పట్టని కాంగ్రెస్ నాయకులు తప్పు పడుతూనే ఉంటారని అన్నారు. కానీ తాను చెప్పడమే కాకుండా స్వతహాగా ప్రధాని నరేంద్రమోడీ కాన్వాయ్ నీ సగానికి తగ్గించుకుని పొదుపు పాటిస్తూ దేశ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఇకనైనా విమర్శలు మాని దేశ హితం కోసం పనిచేయాలని కాంగ్రెస్ నాయకులకు హితవు పలికారు.

# గ్రామ వికాసానికి పాఠశాలే మూలం

**- బడి మనదే బాధ్యత మనదే**
**- సర్పంచుల సదస్సులో డీఈఓ గోవిందరాజులు**




**మక్తల్, మే 13 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు స్థానిక ప్రజాప్రతినిధులే పునాది అని జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజులు తెలిపారు.
జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల ఒకరోజు అవగాహన కార్యక్రమం అత్యంత వైభవంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ గ్రామంలో దేవాలయం ఎంత పవిత్రమైనదో, బడి కూడా అంతే పవిత్రమైనది. గ్రామానికి సర్పంచ్ ప్రథమ పౌరుడు మాత్రమే కాదు, ఆ ఊరి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే సంరక్షకుడు కూడా అని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో సర్పంచుల పాత్రను కొనియాడుతూ, ప్రతి పాఠశాల అద్దంలా మెరిసేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బడి మనదే.. బాధ్యత మనదే" అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు నిజాముద్దీన్, కాజా అమృద్దీన్, గణేష్ సింగ్ మాధవి రామ్ రెడ్డి, కిషోర్, జనార్దన్ రెడ్డి, రాఘవేంద్ర రామ్మోహన్, వీరేష్, నాజియా, శివశంకర్ అశోక్, శేఖర్, శివరాజ్, అజయ్, అమిన్ రెడ్డి వివిధ పంచాయతీల సర్పంచులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంద చిన్నారులను చూసి చలించిన కలెక్టర్ ప్రియాంక

**- కంటి ఆస్పత్రికి తరలించాలని ఆదేశం**



**నారాయణపేట జిల్లా బ్యూరో మే 13(జనంసాక్షి):** అందరూ చిన్నారులను అప్యాయంగా పలకరించినట్టే ఆ పిల్లలను కూడా కలెక్టర్ ప్రియాంక పలకరించారు. కానీ ఆ చిన్నారులకు కంటి చూపు లేదని అక్కడున్న వాళ్లు చెప్పడంతో చలించి పోయి తక్షణమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని పిలిచి చిన్నారులకు కంటిచూపు కల్పించేందుకు హైదరాబాద్ కంటి వైద్య చికిత్స ఆస్పత్రికి తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. తమ ముగ్గురు పిల్లల దృష్టిలోపం పట్ల వెంటనే స్పందించిన కలెక్టర్‌కు ఆ చిన్నారుల కుటుంబీకులు, కాలనీవాసులు మనస్పూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రం లోని ఆరోవార్డు పర్యటనలో కలెక్టర్ చొరవతో ముగ్గురు చిన్నారులకు కంటి చూపు కోసం హైదరాబాద్ ఆస్పత్రికి రెఫర్ చేయడం జరుగుతుందని ఆరోగ్యశాఖ జయచంద్రమోహన్ తెలిపారు.

# మొగ్దుంపూర్ - జక్లేర్ బస్సు పునః ప్రారంభించాలని వినతి

**నారాయణపేట మే 13 (జనంసాక్షి):** నారాయణపేట డిపో నుండి మొగ్దంపూర్ - జక్లేర్ బస్సు పునః ప్రారంభించాలని నారాయణపేట డిపో మేనేజర్ కు సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నో సంవత్సరాల నుండి ప్రయాణికుల కోసం వస్తున్న బస్సు 15 రోజుల నుండి బంద్ కావడం వలన ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని డియంకు తెలిపారు. ఈ రూట్‌లో కేవలం ఒక బస్సు ఉదయం 6 గంటలకు, 11 గంటల సమయంలో ఉండడం వలన ప్రయాణికులు, జిల్లా కేంద్రంలో వివిధ పోటీ పరీక్షలకు వచ్చే విద్యార్థులకు, హాస్పిటల్స్‌లో పనిచేసే వారికి, వివిధ రకాల ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారికి సరి అయిన సమయంలో బస్సులు లేక కష్టాలు పడుతున్నారని అన్నారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు జక్లేర్ నుండి సాయంత్రం 4:45 గంటలకు నారాయణపేట నుండి బయలు దేరడం వలన ప్రయాణికులకు సౌకర్యం ఉండేది అని వివరించారు. అందరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఈ బస్సు పునః ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడే ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుదారులు సర్టిఫికేషన్ పరిశీలన

**శ్రీరంగాపూర్ మే 13 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండల కేంద్రం మండల పరిధిలో వివిధ గ్రామాలకు సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025 26 సంవత్సరం నుంచి ఓబి ఎంఎంఎస్ ఆన్లైన్‌లో అప్లికేషన్ పెట్టుకున్న మన శ్రీరంగాపూర్ మండలం దరఖాస్తుదారులకు రేపు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అనగా 14-5-2025 నాడు ఉదయం 10:30 నుండి వారి యొక్క సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన వలసిందిగా తెలియజేస్తున్నాము. కావున మండల ప్రజాపరిషత్ కార్యాలయం శ్రీరంగాపురం నుండి తమరు పాన్ కార్డు,బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, కాస్ట్ సర్టిఫికెట్‌తో కార్యాలయాన్ని హాజరు కావలసిందిగా ఎంపీఓ రాజు తెలియజేశారు.

# యువ క్రికెటర్లకు రూ.10 వేల చేయూత

**- మున్సిపల్ చైర్మన్ అగ్రి శ్రీనివాస్ గౌడ్**




**పెబ్బేరు మే 13 (జనంసాక్షి):** పెబ్బేరు పట్టణం మినీ స్టేడియంలో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ శిబిరాన్ని ప్రారంభించారు. యువ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ తీసుకుంటే మంచి అవకాశాలు సాధించవచ్చని తెలిపారు.
ఈ సందర్భంగా పేద కుటుంబాలకు చెందిన యువ క్రికెటర్ల కోసం క్రికెట్ సామగ్రి కొనుగోలుకు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన సహాయంపై క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.
మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మే నెల నుంచి జూన్ వరకు నెల రోజులపాటు శిక్షణ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. అనుభవజ్ఞులైన కోచ్‌ల ఆధ్వర్యంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.

# నిరుపేద విద్యార్థులకు అండగా మాస్ భరోసా





**వీపనగండ్ల, మే 14 (జనంసాక్షి):** వనపర్తిలో ఎంబిబిఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్న వీపనగండ్ల గ్రామ విద్యార్థిని అఖిలకు చదువును ప్రోత్సహించడానికి మాస్ మహా ఆది సేవా సంస్థ సంస్థ 20వేల రూపాయలను ఆర్థిక సహాయము అందించడం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలోని నిరుపేద విద్యార్థులకు చదువులో రాణించడానికి పేదరికం ఆటంకం కాకూడదని వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మాస్ సంస్థ గత ఆరు సంవత్సరాల నుంచి 300 మంది నిరుపేద విద్యార్థులకు దాదాపు 40 లక్షలు ఖర్చు చేసిందని అన్నారు. పేద వర్గాలను అభివృద్ధి పథం లోకి తీసుకురావాలని సంకల్పంతో ఉద్యోగులు,అధికారులు ప్రతినెల ప్రజాసేవ నిమిత్తం ఇచ్చిన డబ్బుతో పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసానివ్వడం అభినందించాల్సిన విషయం అన్నారు. ఇటీవల వీపనగండ్ల మండలంలోని ముగ్గురు విద్యార్థులకు, కల్వరాల గ్రామంలోని బొరెల్లి గౌరీకి 60 వేల రూపాయలు బందారు దేవేందర్‌కు 20 వేల రూపాయలు వీపనగండ్లలో అఖిలకు 20 వేల రూపాయలు మాస్ పెద్దలు అందించారని ఈ సందర్భంగా మాస్ ఫౌండర్ మధు డాక్టర్ విజయ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. భవిష్యత్తులో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుకొని సమాజానికి తోడ్పాటు అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మురళి అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు జోల్లు అశోక్ సాయి కుటుంబ సభ్యులు, మురళి పాల్గొన్నారు.

## పేట యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో మే 13(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధ్యానం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధ్యానం తేమశాతం పరిశీలించారు. మంగళ వారం వరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లలకు తరలించడం జరిగిందని, ఇప్పటి వరకు 90 మంది రైతులతో కొనుగోలు చేసిన ధాన్యానికి గాను 74 మంది రైతులకు వారివారి ఖాతాల్లో డబ్బు జమచేయడం జరిగిందని, మిగతా రైతులకు కూడా ట్యాబ్ ఎంట్రీ చేసి ధాన్యం డబ్బులను వారి ఖాతాల్లో వేస్తామని నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ సైదులు, మెప్మా సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కంబాలాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**శ్రీరంగాపూర్ మే 13 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండలం కంబాలాపూర్ గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాని ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో పెబ్బేరు సింగిల్ విండో సీఈఓ వెంకటయ్య, కాంగ్రెస్ మండల నాయకులు అశోక్ కుమార్ రెడ్డి. ఎం. ఎల్ల స్వామి యాదవ్, చటమోని బుడ్డయ్య, , వార్డ్ మెంబెర్స్ కృష్ణ నాయక్, యల్లస్వామి, రాజ్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ బక్కయ్య, గ్రామ రైతులు తిరుపతి, విష్ణు, పూలెందర్, పెద్దయ్య, మేకల రాముడు, ప్రమోద్ రెడ్డి, మేకల బక్కయ్య, ఎల్లస్వామి, ఈశ్వర్, బండి శేఖర్, మేకల గురయ్య, డబ్బా కృష్ణయ్య, లచ్చి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం

**- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**



**కొల్చారం, మే 13, (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని కిస్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరి కావడంతో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వినోద్ నాయక్, పుట్లగట్ల మోహన్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్, గోదావరి, యాదవ్ గౌడ్, సాయిని సిద్ధిరాములు, మహేష్ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



**వెల్దండ మే 13 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం వెల్దండ మండలం రాఘయిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ కు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.14 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ జడ్పీటీసీ ద్యాప విజిత రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పుట్ట రామ్ రెడ్డి, జిల్లా నాయకులు నాగులు నాయక్, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జోగయ్య, రాఘయిపల్లి ఉప సర్పంచ్ కొండల్, వార్డు సభ్యులు ఆనంద్, నరేష్, సీనియర్ నాయకులు నగేష్, రాజు, ప్రవీణ్, సుమన్ నాయక్, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**-దివ్యాంగులకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు**
**-ఉపకరణాల వినియోగంపై అవగాహన అవసరం**
**-జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, మే 13 (జనంసాక్షి);** దివ్యాంగులకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాక వారి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల షెడ్యూల్లో భాగంగా సమగ్ర శిక్ష, అల్మికో సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు వారి పనులు వాళ్ళు చేసుకునేందుకు వీలుగా ఉపకరణాలు దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు గల తమ పిల్లలకు సహకరించి, బాగా చదివిస్తే దివ్యాంగుల కోటాలో త్వరగా ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన ఉపకరణాల వినియోగంపై సంబంధిత అధికారులు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ విజయలక్ష్మి, ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర్ గౌడ్, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, అల్మికో సంస్థ ప్రతినిధులు సోనీ కుమారి, శోభిత్ ద్వివేది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**మద్దూరు మే 13 (జనంసాక్షి):** మద్దూర్ మండలంలోని దోరేపల్లి గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీజేటీఎస్ఏయూ పాలెం శాస్త్రవేత్త డాక్టర్ భానుశ్రీ, పీజేటీఎస్ఏయూ రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ మధుశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మద్దూర్ మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యూరియా ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు భూసారం దెబ్బతింటుందని వివరించారు. నేల పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. అలాగే పంటలలో తెగుళ్లు మరియు పురుగుల నివారణ కోసం రసాయనిక పురుగుమందులు, శిలీంద్రనాశక మందులను వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే ఉపయోగించాలని తెలిపారు. అవసరానికి మించి మందుల వినియోగం రైతులకు ఆర్థిక భారం కలిగించడమే కాకుండా పర్యావరణానికి హానికరమని వివరించారు.

రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని సూచించారు. వరి పంటతో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగు



చేపట్టడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు. వ్యవసాయ నీటి వృథాను నివారించడానికి డ్రిప్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను వినియోగించాలని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతుల ద్వారా నీటి పొదుపుతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని తెలిపారు. అంతేకాకుండా సేంద్రీయ వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం వంటి ప్రకృతి ఆధారిత పద్ధతులను అనుసరించడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండి భగీరథ కేసులో నిజాలు నిగ్గు తేల్చాలి

**- నాగురావు నామాజీ డిమాండ్**

**నారాయణపేట మే 13(జనంసాక్షి):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదు అయిన కేసులో అధికారులు నిజాన్ని నిగ్గు తేల్చాలనీ బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణపేటలో జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్, మీడియా ఇంఛార్జి కిరణ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేవలం కేంద్రమంత్రి బండి సంజయ్ లక్ష్యంగా చేసుకుని ఆయనను బద్నాం చేయడం కోసమే ఈ కేసు కుట్ర అని అన్నారు. కానీ ప్రధానంగా ఈ కేసును బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మసిపూసి మారేడుకాయ చేస్తూ ఆందోళనకు దిగడం విడ్డూరమని అన్నారు. వారి రాజకీయ పతనానికి బండి సంజయ్ పై కక్ష తీర్చుకోవాలని రాజకీయ రాద్దాంతం వచేస్తున్నారని అన్నారు. కానీ బండి సంజయ్ తన కుమారుడిపై వచ్చిన ఆరోపణను నిక్కచ్చిగా దర్యాప్తు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బహిరంగంగా ప్రకటించడం ఆయన నిజాయితీ నిదర్శనం అన్నారు. ఇలా చెప్పే ధైర్యం విపక్షాలకు ఉందా అని సవాల్ చేశారు. కేసు దర్యాప్తులో ఉండగా అరెస్ట్ చేయాలని ఎలా నిరసనలు తెలుపుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది బిజెపి కాదు పోలీసులు కేంద్రం పరిధిలో లేరు అధికారంలో




ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో నిష్పక్షపాతంగా విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయని అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే బండి భగీరథ ను అరెస్ట్ చేయాలనడం విడ్డూరంగా ఉందని అన్నారు. కానీ రాజకీయ బురద చల్లితే వారే బలికాక తప్పదని హెచ్చరించారు.

## గుండారం,పెరకబండ ఐకేపీ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్ శ్రీకాంత్



బెజ్జంకి, మే 13, (జనంసాక్షి): మండలంలోని గుండారం,పెరకబండ గ్రామాల ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను బుధవారం తహసీల్దార్ శ్రీకాంత్,ఎస్సై తోట తిరుపతి,ఏపీఎం పరుశురాములు తో కలిసి పరిశీలించారు.రానున్న రోజుల్లో వర్షాలు ఉండే అవకాశమున్నందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వడ్ల కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేసి,ట్రాక్టర్ల ద్వారా వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి,వడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ శ్రీకాంత్ ఐకేపీ నిర్వాహకులకు సూచించారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు స్థల పరిశీలన

- ఆర్డీవో నవీన్



మిడ్జిల్, మే 13 (జనంసాక్షి): మిడ్జిల్ మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో భారత రాజ్యాంగ రచయిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రపంచ మేధావి అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు బుధవారం ఆర్డిఓ నవీన్ స్థానిక నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలో ని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారి పక్కన స్థలాన్ని పరిశీలించారు. జులై నెలలో మండలంలోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లో భాగంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాల గుర్తించడంలో భాగంగా స్థల పరిశీలన చేశామని. ఆర్డీవో నవీన్ అన్నారు. జాతీయ రహదారి 167కు పక్కన అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టిస్తే అందరికీ బాగుంటుందని అంబేద్కర్ కమిటీ సభ్యులు ఆర్డీవోకు తెలియజేశారు. ఆర్డీవోతో పాటు తాసిల్దార్ రాఘవేందర్ రెడ్డి. రెవెన్యూ సిబ్బంది.అంబేద్కర్ కమిటీసభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు : ఎస్సై శ్రీనివాస్ యాదవ్



మిడ్జిల్ మే 13 (జనంసాక్షి): ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని ఎస్సై శ్రీని వాస్ యాదవ్ అన్నారు మంగళ వారం రాత్రి పోలీస్ సిబ్బంధి blue colt విధులు నిర్వహిస్తూ ఉండగా ఉదయం అందజ 06:00 గంటల సమయంలో కొత్తపల్లి గ్రామ శివా రులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ No. TS 31 TA 0180 ను పోలీసులు పట్టు కొని పోలీస్ స్టేషన్ తరలించారు. ట్రాక్టర్ మీద, డ్రైవరు రతలవత్ మల్లేష్ s/o లింబియా, r/o RC తండా గ్రామంపై కేసు నమోధు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

## మెరుగైన విద్యకు సౌకర్యాలు



పాపన్నపేట, మే 13 (జనంసాక్షి) : విద్యార్థినులకు చక్కటి విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. బుధవారం పాపన్నపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమగ్ర శిక్ష అభియాన్ నిధులు రూ. 42 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు,డార్మిటరీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పాఠశాలలో విద్యార్థినిల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయని,నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ సతీష్ కుమార్, పీఆర్ ఏఈ శ్రీకాంత్, పాఠశాల ఎస్ఓ బాలలక్ష్మీ, పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేశం,తదితరులు ఉన్నారు.

# నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎయిమ్స్ ఆధ్వర్యంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలి
- ఆన్‌లైన్ పరీక్ష విధానంపై కేంద్రం ఆలోచన చేయాలి
- కోహిర్ బీఆర్ఎస్ కౌన్సిలర్ సంపత్ కుమార్

కోహిర్ మే 13(జనంసాక్షి): దేశవ్యాప్తంగా నీట్–యూజీ పరీక్షల నిర్వహణలో వెలుగుచూస్తున్న అవకతవకలు, పేపర్ లీకేజీలు, అక్రమాలు అత్యంత ఆందోళనకరమని, బీఆర్ఎస్ కౌన్సిలర్ సంపత్ కుమార్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు.లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే, పరీక్షల నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యం మరియు అవినీతి కారణంగా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దేశంలో విద్యా వ్యవస్థపై, పరీక్షల పారదర్శకతపై విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నమ్మకం దెబ్బతింటోందని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి మరియు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. కోట్ల రూపాయల కోచింగ్ వ్యవస్థల మధ్య సామాన్య విద్యార్థులు పోటీ పడుతుంటే, పేపర్ లీకేజీలు మరియు అక్రమాలు వారి ఆశలను ఛిద్రము చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పేపర్ లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణను ఎయిమ్స్ ఆధ్వర్యంలో



పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి

- సర్పంచ్ నరేష్ రెడ్డి



నంగునూర్, మే 13 (జనంసాక్షి): నంగునూర్ మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు సహకారంతో గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని మైసంపల్లి సర్పంచ్ నరేష్ రెడ్డి అన్నారు. నంగునూర్ మండల పరిధి లోని మైసంపల్లి గ్రామంలో కాలేశ్వరం నుండి వచ్చే త్రాగునీటిపై కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. ప్రతి దినం వాటిపై ఆధారపడకుండా వేసవి దృశ్య మంచినీటి కొరత కారణంగా ప్రజల దాహార్తిని తీర్చడం కోసం 15 ఫైనాన్స్ నిధుల నుండి రాజ కాలనీ 3ఫేస్ బోర్ నుండి డబుల్ బెడ్ రూమ్ ఓవర్ హెడ్ ట్యాంక్ కి దాదాపు 350మీటర్లు పైప్ లైన్ వేసినట్లు సర్పంచ్ నరేష్ రెడ్డి తెలిపారు.

గతవారం బీసీ కాలనీలో ని 3ఫేస్ బోర్ నుండి ఓవర్ హెడ్ ట్యాంక్ కు దాదాపు 170మీటర్ల పైప్ లైన్ వేసినట్లు తెలిపారు. ఈ రెండు 3ఫేస్ మోటర్స్ ని అందుబాటులోకి తెచ్చి పైప్ లైన్ ద్వారా వాటర్ ట్యాంక్ లకు అనుసంధానం చేయడంతో గ్రామంలో మంచినీటి కొరత తీరిపోతుందని సర్పంచ్ తెలిపారు. ఈ పనులకు సహకరించిన వార్డు సభ్యులకు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు

- రేగోడు మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి



రేగోడ్,మే13(జనంసాక్షి): అర్హులైన పేదలందరికీ ఇంది రమ్మ ఇల్లు నిర్మించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని రేగోడు మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రేగోడు మండల పరిధిలోని దోసపల్లి గ్రామంలో బుధవారం పుర్ర యాదయ్య ఇందిరమ్మ ఇల్లుగృహప్రవేశంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారం భోత్సవం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ అర్హులైన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు లక్షలు రూపాయలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రాంరెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి, బోయిని హన్మంత్,పుర్ర అశోక్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పోతిరెడ్డిపల్లి, నాయిని జలాల్పూర్ గ్రామాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, మే 13,(జనంసాక్షి): కొల్చారం మండలంలోని పోతిరెడ్డి పల్లి, నాయిని జలాల్‌పూర్ గ్రామాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేతలు పలు అంశా లను గురించి చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, వరికోయలను కాల్చడం వలన జరిగే నష్టం,వరి పంటలో వచ్చే చీడ పీడ గురించి, మార్కెట్ ప్రేఫరెడ్ గురించి, సమతుల్య ఎరువుల వినియాగం, మట్టి నమూనా సేకరణ గురించి వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్. పి. సతీష్ మరియు డాక్టర్. త్రివేణి, డాక్టర్. సైదా నాయక్, బి.రాకేష్, సర్పంచులు, ఉపసర్పంచ, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం చేయాలి

**- చేర్యాల ఎంఈఓ, కన్వీనర్ బైర నరేందర్**
**- చేర్యాలలో ఘనంగా విద్యా వారోత్సవాల సభ**
**- హాజరైన నాలుగు మండలాల సర్పంచులు**



**చేర్యాల మే 13 (జనంసాక్షి):** విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలని చేర్యాల మండల విద్యాశాఖ అధికారి, కార్యక్రమ కన్వీనర్ బైర నరేందర్ సూచించారు. బుధవారం మండలంలోని ముస్త్యాల రైతు వేదికలో జనగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన గ్రామ సర్పంచ్ లతో "99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" లో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కన్వీనర్ బైర నరేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని అర్హత కలిగిన ఉపాధ్యాయులు చేత పాఠ్యబోధన నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలు కలిగి ఉన్నాయని, ఉచిత యూనిఫామ్స్, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, కంప్యూటర్ విద్య, ఐఎఫ్ పీ ప్యానల్ ద్వారా పాఠ్యబోధన, లైబ్రరీ ఫెసిలిటీస్, విశాలమైనటువంటి తరగతి గదులు, మరుగుదొడ్లు ఇలా అనేక రకాలుగా సదుపాయాలు ఉంటాయని, ప్రభుత్వ పాఠశాలలోనే మీ గ్రామాల విద్యార్థులు చదివే విదంగా సర్పంచ్ లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల విద్యాశాఖ అధికారులు వరదరాజులు, కోనేటి రవి, మేడిశెట్టి మీనంజనేయులు, జీఈసీఓ నర్మద, జెండర్ స్పెషలిస్ట్ పద్మ, ఆర్పీలు డీ. రాకేష్ రెడ్డి, పబ్బోజు రాజమౌళి, బీ.బాల భాస్కర్, నాలుగు మండలాల సర్పంచులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ శక్తి - బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం

**- ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్**
**- మున్సిపల్ చైర్మన్ నాగేష్ షేట్కార్**






**నాగల్గిద్ద మే 13 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మిషన్ శక్తి - బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ షేట్కార్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మహిళల సాధికారత, బాలికల విద్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ మరియు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాలను అభినందించారు. అలాగే "తెలంగాణ రైజింగ్ - 99 డేస్ యాక్షన్ ప్లాన్" ద్వారా మహిళా మరియు బాలలసంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శభాష్‌పల్లి గ్రామ శివారులో వ్యక్తి హత్య

**- అంకుశపూర్ అన్వర్‌గా గుర్తింపు**



**శివ్వంపేట మే 13 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం శబాష్‌పల్లి గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి హత్య ఘటన మండలంలో కలకలం సృష్టించింది. స్టానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేట మండలం శబాష్‌పల్లి గ్రామ శివారులోని ఆల్‌మీలో పరిశ్రమ ప్రహరీగోడ పక్కన బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి శవం ఉందన్న సమచారం మేరకు పోలీసులతో అక్కడికి వెళ్లి పరిశీలించగా ఒంటిపై గాయాలు, మెడపై కమిలిన గాయాలు ఉన్నాయన్నారు. మృతుడు ఘట్కేసర్ మండలం అంకుశపూర్ గ్రామానికి చెందిన ఎండి. అన్వర్ (50)గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించడం జరిగింది. మృతుడు అన్వర్ డ్రైవర్‌గా అదే గ్రామానికి చెందిన జంగారెడ్డి దగ్గర పనిచేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే ఈనెల 12న బాల్కొండలో ఉన్న ట్రాక్టర్ ను తీసుకొని రమ్మని జంగారెడ్డి చెప్పడం తో అతడి సూచన మేరకు వెళ్లి ట్రాక్టర్ తీసుకొని తిరుగు ప్రయాణంలో శబాష్ పల్లి గ్రామ శివారులో హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని సీఐ వెంకట రాజాగౌడ్, ఎస్ఐ మధుకర్ రెడ్డిలు పరిశీలించి, పలు ఆధారాలు సేకరించారు. నా భర్త ఒక మహిళతో సన్నిహితంగా ఉండేవాడని, మృతుడి భార్య ఫర్జాన తెలిపారు. తన భర్త మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

# నంగునూరు
# మండల బిఆర్ఎస్ నాయకుని పై ఫిర్యాదు



**నంగునూరు మే 12 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై సోషల్ మీడియా వేదికగా చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న నంగునూరు మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సోమిరెడ్డి పై నంగునూరు ఏఎంసి మార్కెట్ కమిటీ బృందం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాపోల్ రాజ్ బహదూర్ రెడ్డి, కర్ణకంటి రవీంద్ర చారి, ఏఎంసి వైస్ చైర్మన్ సాధుల పవన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు ఎండి ఇమ్రాన్, తిప్పని రాజేశ్వర్, రంగు అశోక్, జీవన్ నాయక్, కొమ్మ రాజుల ఐలయ్య, పిడిశెట్టి ప్రభాకర్, శ్యామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన నాగుల గారి మల్లేశం గౌడ్

**- రాంపూర్, వరిగుంతం గ్రామాలలో....**



**కొల్చారం, మే 13, (జనంసాక్షి):**
కొల్చారం మండలంలోని వరిగుంతం , రాంపూర్ గ్రామాలలో పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం గౌడ్ హాజరయ్యారు. మండలంలోని రాంపూర్, వరిగుంతం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహ ప్రవేశానికి నాగుల గారి మల్లేశం గౌడ్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సహకారంతో మొదటి విడతగా కొల్చారం మండలానికి 300 ఇండ్లకు పైగా మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తయిన ఇండ్లను ప్రారంభించుకోవడం ఎంతో శుభ సూచకమని, ఎవరైతే అర్హులు ఉన్నారో పార్టీ అర్హులకు తప్పకుండా మంజూరుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన ప్రకారం కొల్చారం మండలాన్ని ఆవుల రాజిరెడ్డి సహకారంతో పెద్ద మొత్తంలో రెండో ఫేసులో ఇందిరమ్మ ఇండ్లు అత్యధికంగా మంజూరు చేయించుకొని ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రథమ లక్ష్యంగా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ కల్లబొల్లి మాటలు మాట్లాడుతూ ప్రజల వద్దకు ఉనికి కోసం వాళ్ళు తిరిగే పరిస్థితి ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఖబర్దార్ నాయకుల్లారా ఇప్పటికైనా రేవంత్ రెడ్డి పరిపాలనలో నిరుపేదలు గాని అటు ఉద్యోగస్తులు గాని ఎంతో సుఖసంతోషాలతో ఉండడానికి నిదర్శనం పరిపాలనే కారణమని మునుముందు ఇంకెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కొల్చారం మండలాన్ని ఆదర్శవంతం మండలంగా అభివృద్ధి చేసి జిల్లాలోనే కొల్చారం మండలానికి మంచి పేరు తెచ్చేవిధంగా పనిచేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఘనంగా శాలువాలతో సన్మానించడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్, చిన్న ఘనపూర్ గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, రాంపూర్ గ్రామ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ ,కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి, వరిగుంతం గ్రామ మాజీఎంపీటీసీ తుడుం రామకృష్ణయ్య ,సీనియర్ నాయకులు జోగిపేట విట్టల్ గౌడ్ ,చిన్నగంపూర్ పీఏసీఎస్ చైర్మన్ నాగయ్య ,వరిగొంతం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్ల చంద్రం ,వార్డ్ మెంబర్లు అరిగే రమేష్ ,పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన
# హనుమాన్ స్వాములను పరామర్శించిన కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ



**నంగునూర్ మే 13 (జనంసాక్షి):** భద్రాచలం నుండి విజయవాడకు హనుమాల విరమణ కోసం వెళ్తున్న సందర్భంగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై సిద్దిపేట పట్టణంలోని సురక్ష హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సిద్దిపేట నియోజకవర్గం నంగునూర్ మండలం అప్పలాయ చెరువు మరియు నర్మెట గ్రామాలకు చెందిన హనుమాన్ స్వాములను సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గౌరవనీయులు పూజల హరికృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకొని సురక్షితంగా తమ గ్రామాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన భక్తులకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత వైద్యులను కోరారు.
పూజల హరికృష్ణ గారు మాట్లాడుతూ భక్తుల ప్రాణభద్రత అత్యంత ముఖ్యమని, ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భక్తులు త్వరగా కోలుకొని సాధారణ జీవితానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కలీముద్దీన్ అహ్మద్, దాస అంజన్న, మార్క సతీష్, రాజబాహదూర్ రెడ్డి, కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, ఏఎంసి వైస్ చైర్మన్ బస్సా రాజశేఖర్, ఏఎంసి వైస్ చైర్మన్ సాధుల పవన్ కుమార్, ఏఎంసి ఎక్కడ డైరెక్టర్లు ఎండి ఇమ్రాన్, తిప్పని రాజేష్, పిడిశెట్టి ప్రభాకర్, జీవన్ నాయక్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డా ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

**- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**
**- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కమిటీ దరఖాస్తుల స్వీకరణ**

**సంగారెడ్డి టౌన్ మే 13 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు వుంటుందని అన్నారు టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి. సంగారెడ్డి పట్టణం లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కార్యవర్గ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఎస్సీ సెల్ కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లా అబ్జర్వర్ రాజ బద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు ఇవ్వడం లో భాగంగానే పార్టీ కమిటీ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, సురేష్ షెట్కార్ మరియు జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతల సలహాలు, సూచనలతో ఎస్సీ సెల్ నూతన కమిటీ ఏర్పాటు ఉంటుందని, అర్హులైన కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.



ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శితో పాజి అనంత్ కిషన్, జిల్లా నాయకుడు చిదృప్ప రఘు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతు యాదగిరి, ఉపాధ్యక్షుడు గంగేరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులకు ఆహ్వానం : జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 13 (జనంసాక్షి):** జిల్లా యందు గిరిజన విద్యార్థినీ విద్యార్థుల తల్లి తండ్రులకు తెలియజేయునది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతపూర్ లో 2026 - 27 విద్యా సంవత్సరంలో 1వ తరగా ఇంగ్లీష్ మీడియం లో 6 గురికి (బాలురు3, బాలికలు3) విద్యార్థిని విద్యార్థుల ప్రవేశము కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గిరిజన అధికారి నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు.

**విద్యార్థిని విద్యార్థులు తేది:** 01-06-2019 నుండి 31-05-2020లోపు జన్మించిన వారై ఉండవలెను. ఆసక్తి గల వారు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు ఫారము నింపి రెండు ఫోటోలతో పాటు సంబందిత తహసిల్దార్‌చే దృవీకరించబడిన మీ సేవ నుండి పొందిన కులము, 01-04-2026 ర్వాత తీసుకున్న ఆదాయము, నివాస దృవీకరణ సర్టిఫికేట్, విద్యార్థిని పుట్టిన తేది ధ్రువీకరణ పత్రముతో పాటు తల్లి తండ్రుల యొక్క సంవత్సర ఆదాయము గ్రామ పరిదిలో రూ. 1,50,000/- పట్టణ పరిదిలో రూ. 2,00,000/- మించి ఉండరాదు. ఒరిజినల్ దృవీకరణ పత్రములు జతపరచవలయును. దరఖాస్తులను ఫారములు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, 2వ అంతస్తు, రూమ్ నెం. ఎస్17లో గల జిల్లా గిరిజ భివృద్ధి అధికారి కార్యాలయము, మెదక్ జిల్లా నుండి కార్యాలయపు పనివేళలో ఉచితంగా పొంద గల దరఖాస్తులను తేది:-18-05-2026 సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయములో స్వీకరించబడును. అదే విదంగా తేది :22-05-2026 రోజున ఉదయం 11:00 గంటల ల్లా కలెక్టర్ మెదక్ గారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల తల్లితండ్రుల సమక్షములో ఎంపిక కమిటి ఆధ్వర్యంలో డ్రా తీసి



ఎంపిక చేయబడును. కావున ఈ అవకాశమును విద్యార్థినీ విద్యార్థుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పెద్ద శంకరంపేటలో వడ్ల కొనుగోలు కేంద్రం పరిశీలన

**- పేట వ్యవసాయ అధికారి నాగం కృష్ణ**



**పెద్ద శంకరంపేట మే 13 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం నాడు పేట వ్యవసాయ అధికారి నాగం కృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు, సెంటర్ ఇన్చార్జి వాళ్లకు పలు సూచనలు చేశారు.

రైతులు వడ్లను బాగా తూర్పురాబట్టి ఎండబెట్టుకున్న తర్వాత తేమశాతం 17% వచ్చే విధంగా ఎండబెట్టుకొని సెంటర్కు తీసుకొని రావాలని రైతులకు క్రాఫ్ బుకింగ్ లో ఉన్న వాళ్లకి ఎటువంటి ఇబ్బంది ఉండదని, ఒకవేళ క్రాఫ్ బుకింగ్ చేయించుకొని, రైతులు, చనిపోయిన రైతులకు ఆన్లైన్ ఇబ్బందులు కలగకుండా వ్యవ సాయ అధికారులను సంప్రదించాలని, ఆన్లైన్లో ఓపిఎంఎస్ ద్వారా నమోదు చేసుకోవాలని, తిరిగి సెంటర్కు వచ్చినచో కొనుగోలు చేసుకోవడానికి ఇబ్బంది ఉండదన్నారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సెంటర్ కొనుగోలు కేంద్రం ఇన్చార్జి అధికారి రవి, ట్యాబ్ ఆన్లైన్ ఎంట్రీ అధికారి విట్టల్, రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగులో జాప్యం వుండదు

**- జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్**

**మెదక్, మే 13 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలులో జాప్యం ఉండదని జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్ వెల్లడించారు. జిల్లాలో రైతులు తీసుకువచ్చే ధాన్యం కొనుగోలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కోపరేటివ్ అధికారి కరుణాకర్ మీడియాకు తెలిపారు. ఫ్యాక్స్ సెంటర్లు జిల్లాలో 268 సెంటర్లు సన్న ధాన్యం 80 మెట్రిక్ టన్నులు ఇప్పటి వరకు 88,106 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేశామని చెప్పారు. 21వేల208 రైతులకు జమా చెయ్యడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా ధాన్యం సేకరణ చేపడుతోందన్నారు. ప్రతి కొనుగోలు కేం



ద్రంలో అవసరమైన మౌలిక వసతులు, తూకం యంత్రాలు, హమాలీలు రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. పెండింగ్లో వున్న ఫ్యాక్స్ సెంటర్లు తొందరలోనే భర్తీ చేస్తామని వివరించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఘనంగా రేణుకా ఎల్లమ్మ జమదగ్ని కల్యాణం



**చేర్యాల మే 13 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని ముస్త్యాల గ్రామంలో చిమ్మ వారి ఇంట్లో శ్రీ రేణుక ఎల్లమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న పండుగ చివరి రోజైన బుధవారం శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పుట్ట కమ్మడానికి పంబాల కళాకారుల ఆటా పాటలు శివసత్తుల పునకాలతో వెళ్లారు. బుధవారం పంబాల కళాకారుల చేత ఎల్లమ్మ జమదగ్ని కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## రాజ్యాంగం నిన్ను రాజును చేస్తే.....

# వ్యక్తిత్వం నిన్ను బానిసను చేసింది...

**- గ్రామ ప్రజలు అంటున్న మాటలు....**



**కొల్చారం, మే 13,(జనంసాక్షి):** కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ ఎటువంటి అభివృద్ధి పనులు చేయడానికి వెనకాడుతున్న పాలకవర్గం

ఎలక్షన్ కు ముందు వార్డు సభ్యులు, సర్పంచ్, మమ్మల్ని గెలిపిస్తే వార్డులో గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించి మండలంలోని ఆదర్శ గ్రామపంచాయతీ గా తీర్చిదిద్దుతామని చెప్పిన తీరు మాటలకే పరిమితమైంది గ్రామంలోని పలు వార్డుల్లో సమస్యలు ఉన్నప్పటికీ వార్డు సభ్యులు సర్పంచ్ కూడా స్పందించకపోవడంతో పాలకవర్గంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు

గ్రామాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకవర్గ సభ్యులు గ్రామసభ ఏర్పాటులో పాలకవర్గ తీరు పై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారు

గ్రామంలోని వీధిలైట్లు సైతం పట్ట పగలు కూడా వెలుగుతున్నాయి ఎస్సీ కాలనీలో గత రెండు నెలల నుండి మోటర్ నుండి వాటర్ ట్యాంక్ లోకి నీరు వచ్చే పైప్ లైన్ లీకేజీ కారణంగా మురుగునీరు, కలుషిత నీరు వస్తున్నాయి పొడిచెరువు తండాలో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొంది అయినా కూడా వార్డు సభ్యులు స్పందించకపోవడంతో తండా ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు

జలపై తండాలో కూడా నీటి సమస్య ఉంది అయినా కూడా పాలకవర్గ సభ్యులు స్పందించడం లేదని చెప్పారు

గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ పనులలో ఎందుకుజాప్యం జరుగుతుందని ప్రజలు ప్రశ్నిస్తే వార్డు సభ్యులు సర్పంచ్‌ల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా తెలుస్తుంది

గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణం మోరీల నిర్మాణం పనులలో తాము అంటే తమే చేస్తామని పాలకవర్గ సభ్యులు అభివృద్ధిని పక్కకు పెట్టి చోద్యం చూస్తున్నారు

పనులు సర్పంచ్ వార్డు సభ్యులు కాకుండా ఇతర వ్యక్తులకు ఇస్తే అలాగైనా గ్రామ అభివృద్ధి చెందుతుందని ప్రజలు కోరుకుంటున్నారు

రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులు అభివృద్ధి వైపు కాకుండా అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడంతో ఇతర వ్యక్తులకు పనులు అప్పజెప్పి గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని కోరుకుంటున్నారు

సొంత నిర్ణయాలు తీసుకో లేనంత స్థితిలో ప్రజాప్రతినిధులు ఉండటంతో మీరు ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలనుకుంటున్నారు ప్రజా ప్రతినిధులు తీరు ఇలాగే ఉంటే గ్రామం లోని అభివృద్ధి చెందేదెప్పుడు ఉత్తమ గ్రామపంచాయతీ అయ్యేది ఎప్పుడు

ఇప్పటికైనా పాలకవర్గ సభ్యులు పరస్పర అంగీకారంతో గ్రామాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తే బాగుంటుందనీ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు తరలించాలి.. తాసిల్దార్ ప్రభుదాస్...





పెద్ద శంకరంపేట్ మే 13 (జనం సాక్షి): ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లర్లకు తరలించాలని పెద్ద శంకరంపేట తాసిల్దార్ ప్రభుదాస్ అధికారులకు సూచించారు.. బుధ వారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్‌లో ఏర్పాటు చేసిన ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ కేంద్రం లో హమాలీల కొరత ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సంబంధిత అధికారులు తాసిల్దార్‌కు తెలిపారు. అనంతరం రాచరాయ రైస్‌మిల్లు సందర్శించి లారీల ద్వారా వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే దించుకోవడంతోపాటు మళ్లీ వెంటనే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఎరువుల వాడకం తగ్గించాలి

తూప్రాన్ మే 13 (జనంసాక్షి): రైతులు పంటల సాగులో ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సవిత,ప్రమీల అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండలం చెట్ల గౌరారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వినియోగం, నేల ఆరోగ్యం పరిరక్షించుకోవడం, భూసార పరీక్షలు చేసుకోవడం - వాటి వల్ల లాభాలు,యూనివర్సిటీ వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలతో పంటలు సాగు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్, ఏఈఓ సచిన్, పాలకవర్గ సభ్యులు, నాయకులు రైతులు పాల్గొన్నారు.

## సొంతింటి కల
## ప్రజా పాలనలో సీఎంతో సాధ్యం : ఎమ్మెల్యే



మల్దకల్ మే 13(జనంసాక్షి): మండల పరిధిలోనిమల్లెందొడ్డి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరు కాగాకుర్వ మహేశ్వరీ, తెలుగు సుజాత,తెలుగు జయమ్మకు మంజూరయ్యాయి.

గద్వాలఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి.రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ,మాజీ ఎంపీపీలు రాజారెడ్డి,విజయ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి,సర్పంచ్ కురువ పార్వతమ్మ,నాయకులు చక్రధర్ రెడ్డి,వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన పకడ్బందీగా నిర్వహించాలి... పేట తాసిల్దార్ ప్రభుదాస్



పెద్ద శంకరంపేట మే 13 (జనంసాక్షి): జనగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు పెద్దశంకరపేట తాసిల్దార్ ప్రభుదాస్ సూచించారు. బుధవారం పెద్ద శంకరంపేటలో జన గణన నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లతో మాట్లాడడంతో పాటు పలు సూచనలు సలహాలు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత ఉన్నత అధికారులకు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆయన వెంట ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**- బాధిత బాలికకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్**



చిన్నశంకరంపేట, మే 13 (జనంసాక్షి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిన్న శంకరంపేట బిఆర్ఎస్ వి నాయకులు అత్తిలి నాగరాజు, గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం చిన్న శంకరంపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కేసు దర్యాప్తులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. చట్టం అధికార పార్టీకొ రకం సామాన్య ప్రజలకొ రకం వేర్వేరుగా అమలవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కలిసి కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్వీ నాయకులు అత్తిలి నాగరాజు, గోపాల్ నాయక్, యండి.ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్లగౌరారంలో అన్నదాతలకు ఎరువులపై అవగాహన

**- తక్కువ యూరియాను వాడాలి**
**- నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం**
**- సేంద్రియ ఎరువులను వాడాలి**



మనోహరాబాద్ మే13 (జనంసాక్షి): చెట్ల గౌరారం గ్రామంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి. సవిత ఏం.ప్రమీల( ప్రధాన శాస్త్రవేత్త) మాట్లాడుతూ డ్రిప్ మరియు తుంపర సేద్యం ద్వారా నీటిని ఇచ్చేటప్పుడు ఆయా పంటలలో సిఫారసు చేసిన మోతాదు సమయం ప్రకారమే వినియోగించాలని సూచించారు. నేల, నీరు వాతావరణ కాలుష్యం తగ్గించడానికి, నేలసారం పెంచడానికి, హరిత వాయు ఉద్గారాలు తగ్గించడానికి వివిధ పంటలలో, ఉద్యానవన తోటలలో, అటవీ వ్యవసాయ విధానంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. అడవి పందుల మరియు కోతుల నుండి పంటలను కాపాడడానికి సోలార్ ఫెన్సింగ్, మరియు ఆత్రనాథ యంత్రాలను వినియోగించాలని తెలియచేసారు. పంటలలో అధిక యూరియా వినియోగం తగ్గించాలని, దానికి ప్రత్యామ్నాయంగా పచ్చి ఆకు ఎరువులు,కోళ్ళ, పశువుల, గొర్రెల ఎరువులు, వాన పాముల ఎరువులు వాడినట్లయితే సిఫారసు చేసిన నత్రజనిలో 25 నుంచి 50 శాతం వరకు తగ్గించవచ్చు అని డా ప్రేమ్ పేర్కొన్నారు. అలాగే తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే రసాయనాలు వాడాలని పంట మార్పిడి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దివ్య శ్రీహరిగౌడ్ వ్యవసాయ విస్తరణ అధికారి సచిన్ పాలకవర్గ నాయకులు మరియు అధిక సంఖ్యలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ నేపథ్యంలో
## తూప్రాన్ టోల్ గేట్ చెక్ పోస్టును తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 13 (జనంసాక్షి): రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు అప్రమత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తూప్రాన్ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్టును ఆయన స్వయంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ నేపథ్యంలో జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే అనుమానాస్పద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అలాగే చెక్ పోస్టుల వద్ద ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల రవాణా తనిఖీల్లో సమన్వయం కోసం వెటర్నరీ సిబ్బంది కూడా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాఫిక్ బ్యాటన్స్ మరియు రిఫ్లెక్టివ్ జాకెట్లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్య కలాపాలపై సమాచారం ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలి. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు.